క్లుప్తంగా

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

సఖినేటిపల్లి: మండలంలోని **గుడిమూలలో** సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ **నిర్మాణ పను**లకు రాజోలు ఎమ్మెల్యే దేవ వర**ప్రసాద్ శంకు**స్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవి**ష్కరించారు.** నియోజకవర్గంలో విద్యుత్ సమ**స్యలు లేకుం**డా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే అన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ దెందుకూరి వెంకట శ్రీహరిరాజు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వీర్రాజుకు అభినందనలు

కొత్తపేట: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సోము వీర్రాజుకు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు అభినందనలు తెలియచేశారు. ఎమ్మెల్యే కోటాలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైన రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును సోమవారం విజయవాడలో బీజేపీ కార్యాలయంలో పాలూరి, మోకా, జిల్లా, నియోజకవర్గ బీజేపీ నాయకులతో కలసి అభినందించారు.

క్విజ్ పోటీల్లో విజేత మంజుశ్రీకి అభినందన

అయినవిల్లి: ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు సోమవారం జరిగాయి. ఈ పోటీల్లో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పదం మంజుశ్రీ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఆమెను జిల్లా డీఈవో సలీంబాషా చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకుంది. గైడు టీచర్లుగా ఆర్ భాస్కరరావు, జి. సాయిశ్రీనివాస్‌లు వ్యవహరించారు. మంజుశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

పి.గన్నవరం: స్థానిక కెనాల్ రోడ్డులో సోమవారం ఉదయం ఒక కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్తంభాన్ని ఢీకొట్టిన అనంతరం కారు కాలువలో పడకుండా ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు నుంచి నిడదవోలు వెళుతున్న కారుకు తాటికాయలవారిపాలెంలోని ధనవర్ష ఫంక్షన్ హాలు సమీపాన సైక్లిస్టు అడ్డువచ్చాడు. అతడిని తప్పించే క్రమంలో డ్రైవర్ కాలువ వైపున ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. కారు కాలువలో పడకుండా విద్యుత్ స్తంభం ఆపింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ ప్రాంతంలో కాలువ లోతు ఎక్కువగా ఉంది. విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. కారులో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అయినవిల్లి: అయినవిల్లిలంక గ్రామంలో గోదావరి నీటి ప్రవాహానికి అడ్డుగా ఓఎన్‌జీసీ కార్యకలాపాలు చేస్తుందని ఆ పనులపై సోమవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్‌కు ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ సర్పంచ్ కుమ్మరి మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి శైలజ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి

ఆలమూరు: కాకినాడ–జొన్నాడ ఆర్‌అండ్‌బీ రోడ్డులోని గుమ్మిలేరులో సోమవారం జరిగిన రోడ్డు ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. రామచంద్రపురం నుంచి అమరావతికి వెళుతున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆ దృశ్యం కంటపడింది. దీనిపై సత్వరమే స్పందించిన మంత్రి సుభాష్ ఆ మహిళ వద్దకు వెళ్లి పోలీసుల సహకారంతో తన కాన్వాయ్‌లో మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నట్టు స్థానికులు తెలిపారు.

ప్రింటర్ బహూకరణ

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం పాఠశాల తెలుగు పండిట్ వేదాల నీలావతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.12 వేలు విలువైన మోడల్ ప్రింటర్ బహూకరించారు. ఈ మేరకు పాఠశాలలో హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణకు, నీలావతి భర్త ఎస్.గోపీకృష్ణ అందజేశారు.

వెయ్యి లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం 1000 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం రాజవరం సమీప గోదావరిలో సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం బెల్లంఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెచ్‌సీలు వైవీ సత్యనారాయణ, పి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంతోనే ఆరోగ్యం

మలికిపురం: గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యంతోనే ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉందని మలికిపురంలో ఎంపీడీఓ జి.మల్లికార్జునరావు పేర్కొన్నారు. సోమవారం మలికిపురంలో చెత్త సేకరణలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులతో కలసి ఆయన చెత్త సేకరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు విధిగా తమ విధులను నిర్వర్తిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి ఐ.శుభాకర్, పిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్లపై మైనర్ల దూకుడు

- పిల్లలకు మోటార్ సైకిల్స్ ఇస్తున్న తల్లిదండ్రులు
- మట్టి, ఇసుక ట్రాక్టర్లు నడుపుతున్న బాలురు
- ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు
- రాంగ్ రూట్లో ప్రయాణంతో ప్రమాదాలు



కొత్తపేటలో వాహనం నడుపుతున్న మైనర్

కొత్తపేట: ఇటీవల కాలంలో రోడ్లపై మైనర్ల మోటార్ సైకిల్ దూకుడు పెరిగిపోయింది. చేతిలో ఎక్స్‌లేటర్ తిప్పితే రయ్ రయ్ మంటూ దూసుకుపోతోంది. ద్విచక్రవాహనాలు, కార్ల సంఖ్య పెరిగిపోయింది. రోడ్లన్నీ నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నిండా 15 ఏళ్లు కూడా లేని మైనర్లు బైక్‌లు ఇతర మోటార్ సైకిళ్లతో వీధుల్లోనే కాక ప్రధాన రహదారుల్లో సైతం రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మట్టి, ఇసుక ట్రాక్టర్లను కూడా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారు. మైనర్లకు రోడ్ నిబంధనలు, జాగ్రత్తలపై అవగాహన లేక తమ ఇష్టం వచ్చినట్టు డ్రైవింగ్ చేయడం వలన ఎదురుగా వచ్చే వాహనాదారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు. ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదుట వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. తెలిసి తెలియని వయసులో వాహనాలను వేగంగా నడుపుతూ తమ ముందు వెళుతున్న వాహనాలను అధిగమిస్తున్నారు. బాలురు బైక్‌లపై, బాలకలు స్కూటీలతో ప్రధాన రోడ్లపై ప్రయాణిస్తున్నారు. బాలురైతే ఒకే బండిపై ముగ్గురు, నలుగురు ఎక్కి ప్రయాణిస్తున్నారు. పలువురు అయితే బైక్‌తో విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ఒక్కోసారి వాహనం గేరు మార్చడానికి, షడన్‌గా ముందు మరో వాహనం వస్తే బ్రేక్ వేయడానికి కూడా అవకాశం లేని విధంగా మెరుపు వేగంతో దూకుడుగా వెళ్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఇటీవల కాలంలో పోలీస్ బీట్లు విస్తృతం చేశారు. ప్రతీ నిత్యం వివిధ కూడళ్లు, వివిధ ప్రాంతాల్లో పోలీసులు విధులు నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నా, నిబంధనలు పాటించకపోయినా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పలువురిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఫైన్లు వేస్తున్నారు. అయినా అనేకమంది నిబంధనలు పాటించడం లేదు.

తల్లిదండ్రుల ఆనందం ఆ వీధికే పరిమితం కావాలి

తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్నారు. మా అబ్బాయి బైక్ నడుపుతున్నాడు. మా అమ్మాయి స్కూటీ నడిపేస్తుంది అని మురిసిపోతున్నారు. వారిని వివిధ పనుల నిమిత్తం మోటార్ సైకిల్స్ ఇచ్చి బయటకు పంపుతున్నారు. మా అబ్బాయి లేదా మా అమ్మాయి మోటార్ సైకిల్ డ్రైవ్ చేసేస్తోంది.. అనే ఆనందం తమ పిల్లలు మేజర్స్ అయ్యే వరకూ ఆ వీధికే పరిమితం కావాలి. తల్లిదండ్రులు తమ పిల్లల వెంటే ఉండి జాగ్రత్తలు తీసుకుంటూ డ్రైవ్ చేయించాలి. ఆ వీధిలో రోడ్డుకే పరిమితం కావాలి. కానీ పలువురు తల్లిదండ్రులు అలా చేయకుండా బైక్‌పై వెళ్లొచ్చెయ్ అంటూ బైక్ ఇచ్చేస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం మోటార్ వాహన చట్టం ప్రకారం నేరం. ఇది తెలిసినా చాలా మంది తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. దాంతో పూర్తిగా అనుభవం లేకుండా వాహనాలు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. నిబంధనలు పాటిస్తూ రోడ్లపై వెళుతున్న వాహనదారులను మైనర్లు నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నడిపి ఢీకొడుతున్నారు. పలువురు మైనర్లు ప్రమాదాలకు గురై తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు



మోటార్ సైకిల్స్ డ్రైవింగ్‌లో **నిబంధనలు** అతిక్రమిస్తే చట్ట**రీత్యా చర్యలు** తప్పవు. **ముఖ్యంగా మైన**ర్లకు మోటార్ **సైకిల్ ఇవ్వడం** మోటార్ **వాహన చట్టం** ప్రకారం నేరం. నిబంధనలు **పాటించకుండా** వాహనాలు నడపడం, జాగ్రత్తలు **పాటించకపోవ**డం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు ఎక్కడికక్కడ పోలీస్ స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించి వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించడం, ఫైన్‌లు వేయడం జరుగుతుంది. ఇది పోలీసు శాఖ కోసం కాదు. తిరిగి నిబంధనలు అతిక్రమించకుండా, మళ్లీ ఆ తప్పు చేయకుండా ఉండేందుకే. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ విషయంలో తల్లిదండ్రులు కూడా బాధ్యులవుతారు. పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

– సుంకర మురళీమోహన్, డీఎస్పీ, కొత్తపేట

శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలి



ఆలమూరులో సాగునీటి ఎద్దడిపై రైతులతో మాట్లాడుతున్న గారపాటి

ఆలమూరు: మండలంలోని జొన్నాడ కాలువ వెంబడి పంట కాలువలో ఎగువన ఉన్న వారిని పండించే రైతులు అడ్డుకట్ట వేయడం వల్ల సాగునీరు అందక తాము తీవ్ర ఇబ్బందులు దిగువ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు చొదరికి రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఎగువ ప్రాంతంలోని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. పంటకాలువకు అడ్డుకట్ట వేయడం వల్ల దిగువ రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. సాగునీరు వంతుల వారీ విధానంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీరు సక్రమంగా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఎగువ ఉన్న ప్రాంత రైతులు అందుకు అంగీకరించారు. అలాగే ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే రోడ్డులోని కోడు భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రేపటి 'యువత పోరు'కు సిద్ధం కండి

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపు
- మలికిపురంలో పోస్టర్ ఆవిష్కరణ



మలికిపురంలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నాయకులు

మలికిపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 12న జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే యువత పోరు ఆందోళనకు అంతా సిద్ధం కావాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే వైఎస్సార్ సీపీ యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగింది. పెద్ద ఎత్తున హాజరైన పార్టీ శ్రేణుల మధ్య గొల్లపల్లి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి కూటమి ప్రభుత్వం వారితో చెలగాటమాడుతూ అరాచకపాలన సాగిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తుందన్నారు. దీంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మరింత మెరుగ్గా జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా వేధించడం దారుణమన్నారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాతే రాష్ట్రంలో సరైన విద్యా విధానం అమలులోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని అమలు చేయడం మానేసి ప్రతిపక్షంపై విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాన శంకరరావు, పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, దొంగ నాగ సత్యనారాయణ, పెదపాటి నాగలక్ష్మి, మిందిగుదిటి శిరీష్, అడబాల జానకీరామ్, తాడి సహదేవ్, మోకా సురేష్, ఈద రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో యువత పోరుబాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న కోఆర్డినేటర్లు గన్నవరపు, సూర్యప్రకాష్

యువత పోరు విజయవంతం చేద్దాం

- కోఆర్డినేటర్ గన్నవరపు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూర్యప్రకాష్
- పి.గన్నవరం, రావులపాలెంలో వాల్‌పోస్టర్ల విడుదల

పి.గన్నవరం/రావులపాలెం: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ ఈనెల 12న అమలాపురంలో జరగనున్న యువత పోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం పి.గన్నవరంలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ ఆందోళన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, విద్యార్థుల తల్లిదండ్రులు తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విద్యారంగం అభివృద్ధికి రూ.73 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వివరించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను మోసగించారని అన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థులపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పి.గన్నవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 12న అమలాపురంలో జరుగనున్న యువత పోరు కార్యక్రమానికి నియోజవర్గంలో నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లాలని వారు కోరారు. అదే రోజున వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి మండలంలోనూ ఘనంగా నిర్వహించాలని సూచించారు. విద్యాదీవెన, వసతి దీవెన, నిరుద్యోగ భృతి వంటి పథకాలను అమలు చేయకుండా మోసగించిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, విత్తనాల ఇంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహరావు, వాసంశెటి తాతాజీ, అముడా మాజీ చైర్మన్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట, ఆలమూరు ఎంపీపీలు మార్గన గంగాధరరావు, తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, రావులపాలెం, ఆలమూరు మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో దర్శనం కల్పించేలా చర్యలు

- ఎమ్మెల్యే బండారు
- వాడపల్లి క్షేత్రంలో అధికారులతో సమీక్ష



వాడపల్లిలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రానికి తరలి వచ్చే భక్తులకు స్వామి దర్శనం భారం కాకుండా, సకాలంలో దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో మజ్జిగ చలివేంద్రాన్ని, వకుళ మాత అన్నప్రసాద భవనం పునర్నిర్మాణ పనులను, గోశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న వివిధ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం క్షేత్రంలో అభివృద్ధి పనులు, వచ్చే నెల 7 నుంచి 13 వరకూ జరిగే స్వామివారి కల్యాణోత్సవాలపై దేవస్థానం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ క్షేత్రానికి స్వామిపై భక్తి, విశ్వాసంతో ప్రతి నిత్యం ముఖ్యంగా శనివారాలు లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వెనకబడుతున్నారన్న అంశాన్ని గమనించామన్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించి, భక్తులు ఏ విధమైన అసౌకర్యాలకు గురికాకుండా స్వామి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్నదాన మండపం, గదులు నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు, రోడ్డు విస్తరణకు, ట్రాఫిక్ సమస్యలు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటరామన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్ఐ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా గోపాల్



గ్రామశాఖ అధ్యక్షుడు గోపాల్‌ను సత్కరిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: పాశర్లపూడిలంక వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా పాలమూరి గోపాల్‌ను ఎన్నుకున్నారు. పార్టీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాల్‌ను పి.గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి సోమవారం ఘనంగా సత్కరించారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, యల్లమెల్లి ఏడుకొండలు తదితరులు గోపాల్‌ను అభినందించారు.

పని ఒత్తిడి తగ్గించాలి



పని భారం తగ్గించాలని ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ కార్యదర్శులు

ఆలమూరు: గ్రామ పంచాయతీల్లో విపరీతంగా పెరిగిపోయిన పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాలని మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ ఎ.రాజుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల గ్రామ కార్యదర్శుల సమావేశం జరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వేణు ఆధ్వర్యంలో కార్యదర్శుల బృందం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ అనునిత్యం వివిధ రకాల సర్వేలతో గ్రామ స్థాయిలో అనేక కార్యక్రమాలను పూర్తి బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడం వల్ల పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.. దీనివల్ల అనేక మంది గ్రామ కార్యదర్శులకు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. దీనివల్ల గ్రామ పంచాయతీలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడానికి తమకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

కొత్తపేట: స్వయం ఉపాధి పథకం కింద బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీఎస్ఎన్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు (బీసీ), ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) మహిళలకు ప్రభుత్వం భవిష్యత్‌పై భరోసా పెంచేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. టైలరింగ్‌లో నిష్ణాతులైన వారితో 45, 60, 90 రోజుల్లో కుట్టుశిక్షణ ఇచ్చి, అనంతరం ఉచితంగా కుట్టుమెషీన్ అందజేస్తామని తెలిపారు. అందుకు మండల పరిధిలో కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అందుకు 18–50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు అర్హులని, రైస్ కార్డు కలిగి ఉండాలని, కమ్యూనిటీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, ఆధార్ కార్డు, మొబైల్ నంబరు ఉండాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



కోదండరామునికి పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు వ్యాఘ్రేశ్వరం శివారు గొల్లగుంట కొప్పిశెట్టివారిపాలెంలో కోదండరామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసుల విజయ్ గోపాలాచార్యుల బ్రహ్మత్వంలో పండితుల సమక్షంలో శిలామయ శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సహిత గణపతి, ఆంజనేయ, శిలాధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, కళావాహన, గోదృష్టి, శాంతి కల్యాణం, యజమానులకు మహదాశీర్వచనం, కుంభోదక మార్జనలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన చేపట్టారు. స్వామి వారిని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోఆర్డినేటర్ శ్రీనివాసరావుతో పాటు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, వాసంశెట్టి పెదబాబు, మట్టపర్తి నాగరాజు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

సావిత్రీబాయి ఆదర్శనీయురాలు

మామిడికుదురు: భారతీయ తొలి సంఘ సంస్కర్త, దేశ తొలి ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రీబాయి పూలే ఆదర్శనీయురాలని కోనసీమ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరరావు కొనియాడారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని మామిడికుదురు బాలుర వసతి గృహం ప్రాంగణంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నైనాల రఘురామయ్య, రాయుడు నాగేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పోలవరపు సాయిబాబు, కుడుపూడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట: స్త్రీ విద్యా ప్రదాత సావిత్రీబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శనీయమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ సీహెచ్ భవానీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీలు ఇంటి నుంచి బయటకు రావడానికి నిషేధం ఉన్న రోజుల్లో మహిళలకు విద్య కల్పించడం కోసం సావిత్రీబాయి పూలే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పీఎంఎంఎస్ఏను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. పీఎంఎంఎస్ఏలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో సోమవారం నిర్వహించిన పీఎంఎంఎస్ఏలో సుమారు 138 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి



కోన ఆనందరాజు

రాజోలు: శివకోడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోన ఆనందరాజు (63) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సోమవారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, సర్పంచ్ నక్కా రామారావు, కూనపరెడ్డి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల జానకీరామ్ తదితరులు ఆయన కుంటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆనందరాజు శివకోడు 18 దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా, ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తూ కాంగ్రెస్ పార్టీలో ఎంపీటీసీగా గెలుపొందారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీలో కొనసాగుతూ సేవలందించారు.

పద్యకవి దేవరకొండకు సత్కారం

రాజోలు: పద్యకవి దేవరకొండ శ్రీనివాస వెంకట రమణరావును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం సత్కరించారు. వెంకట రమణారావు రచించిన 'సున్నా శతకము', 'నా మనసారా నా సీసాలు' రచనలను ఎమ్మెల్యే వరప్రసాద్‌కు అందజేశారు. 'సున్నా శతకము' వస్తు వైవిధ్యము 'నా మనసారా నా సీసాలు' సామాజిక స్పృహతో కూడిన అంశాలతో సందేశాత్మకంగా ఉన్నాయని ఎమ్మెల్యే వరప్రసాద్ ప్రసంశించారు. రచనలు చేసిన వెంకట రమణరావును దుశ్శాలువాతో సత్కరించిచారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

ఆలమూరు: డ్వాక్రా మహిళల పూర్తి సమాచారం నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ రూరల్ లైవ్‌లీ హుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) పథకంలో భాగంగా రూపొందించిన లోకోస్ యాప్‌పై సోమవారం యానిమేటర్లకు శిక్షణ జరిగింది. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎం ఎం.ధనరాజు ఎంఎస్ఏ ఎం.నవీన్ కుమార్ సుదీర్ఘంగా శిక్షణ ఇచ్చారు. మండలంలో ప్రస్తుతం ఉన్న 1918 డ్వాక్రా సంఘాల వివరాలను పూర్తి స్థాయిలో లోకోస్ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. అందులో భాగంగా మండల, గ్రామ డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు, సభ్యుల వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలపై వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈనెలాఖరు నాటికి కచ్చితంగా ప్రతి డ్వాక్రా సంఘ సభ్యురాలికి సంబంధించి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వారు సూచించారు. దీనివల్ల భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు నేరుగా డ్వాక్రా మహిళలకు అందించే వీలు కలుగుతుందన్నారు.